క్లుప్తంగా

మేయర్ ప్రత్యేక పూజలు



వినాయకుని సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్: తొలి ఏకాదశి సందర్భంగా కడప నగరంలో అప్సర థియేటర్ పక్కనున్న శ్రీ వినాయక స్వామి ఆలయంలో కడప మేయర్ కె. సురేష్ బాబు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ప్రజలకు తొలి ఏకాదశి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మెన్ పులి సునీల్ కుమార్, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మెన్ ఎస్. యానాదయ్య, డివిజన్ ఇన్‌చార్జులు ఐస్‌క్రీం రవి, చల్లా రాజశేఖర్ పాల్గొన్నారు.

జీతాల చెల్లింపునకు చర్యలు తీసుకోవాలి

– ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి



మాట్లాడుతున్న రమణా రెడ్డి

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో పదోన్నతులు, బదిలీల్లో వెళ్లిన ఎంఈఓ–2 , పీజీటీలు, భాషా పండితుల జీతాల చెల్లింపునకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఎస్టీయూ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి, చెన్నకేశవరెడ్డి కోరారు. గురువారం కడపలోని ఎస్టీయూ భవన్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ మధ్య జరిగిన బదిలీల్లో కొంతమంది ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వివిధ మండలాలకు ఎంఈఓ–2గా బదిలీ అయ్యారని.. వారి జీతాల చెల్లింపులో నెలకొన్న సందిగ్ధతకు తెరదించి జీతాల చెల్లింపుకు చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి రఘునాథ రెడ్డి, రాష్ట్ర కార్యవర్యవర్గ సభ్యులు బాల గంగిరెడ్డి, గురుకుమార్, సీనియర్ జిల్లా నాయకులు సురేష్‌బాబు, జయరామయ్య, శంకరయ్య,సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో కళాకారుల సందడి



శిల్పారామంలో కళాకారుల ప్రదర్శనలు

కడప కల్చరల్ : కడప శిల్పారామంలో గురువారం బక్రీద్ పర్వదిన సందర్భంగా ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా పులివెందులకు చెందిన శ్రవణ్ డ్యాన్స్ అకాడమి కళాకారులు స్థానిక కళాబృందాలతో కలిసి సాంస్కృతిక వేదికపై తమ ఆటపాటలతో సందడి చేశారు. పలు జానపద, శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు. సామాజిక అంశాలపై పలు కామెడీ స్కిట్‌లను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. శిల్పారామం పాలనాధికారి శివప్రసాద్‌రెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

పంటల బీమా మంజూరు

సింహాద్రిపురం : కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి చొరవతో పంటల బీమా మంజూరైందని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు శ్రీకాంత్ రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డిలు తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ 2022 ఖరీఫ్ పంటలైన చీనీ, పత్తి, ఉల్లి, కంది, వేరుశనగ పంటలకు వాతావరణ బీమా మంజూరైందని.. ఇందులో చీనీకి మండల వ్యాప్తంగా 17035 ఎకరాలకుగానూ రూ.16.35 కోట్లు మంజూరైందని.. ఈకేవైసీ, ఈ–క్రాప్ చేసుకున్న రైతుల జాబితాను ఆయా ఆర్‌బీకేలలో ప్రదర్శించడం జరిగిందని.. రైతులు తమ పేర్లను చెక్ చేసుకోవాలన్నారు. పేర్లు ఉన్న రైతులకు ఆయా పంటలకు ఒక వారంలో వారి ఖాతాలలో డబ్బులు జమ అవుతాయన్నారు. చీనీ పంటకు రూ.9,600లు, ఉల్లికి రూ.10,180లు, వేరుశనగ పంట రూ.6239లు, పత్తి (వర్ష ఆధారిత) పంటకు రూ.8882లు, పత్తి (బోర్ల కింద సాగు) పంటకు రూ.14,667లు, శనగ పంటకు రూ.812లు ఎకరాకు చొప్పున పంటల బీమా మంజూరైందన్నారు. తొలి ఏకాదశి పండుగ రోజున రైతుల ముఖాల్లో చిరునవ్వు చూడాలన్న లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయ సాధనకు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కృషితో పంటల బీమా మంజూరైందన్నారు.

లక్ష్మీ నరసింహస్వామికి ప్రత్యేక పూజలు

ప్రొద్దుటూరు కల్చరల్ : మండలంలోని నరసింహాపురం గ్రామంలోని పురాతన లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో స్వామివారి జన్మనక్షత్రం స్వాతి, తొలిఏకాదశి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. వేకువజామున స్వామి, అమ్మవారి మూలవిరాట్‌కు విశేష అభిషేకాలు చేశారు. ప్రత్యేంగా పట్టు వస్త్రాలతో, వెండికవచాలు, రంగురంగుల పూలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్ ప్రార్థనలు

భక్తులతో కళకళలాడిన మసీదులు, ఈద్గాలు



దండు షాహి ఈద్గాలో బక్రీద్ సందేశం ఇస్తున్న హజరత్ జమాలుల్లాబాష సాహెబ్



అల్మాస్‌పేట మసీదులో పండుగ సందేశం ఇస్తున్న భక్తియారుద్దీన్ ఖాద్రి సాహెబ్



బక్రీద్ ప్రార్థనలు నిర్వహిస్తున్న భక్తులు

కడప కల్చరల్ : త్యాగానికి, దైవంపై విశ్వాసానికి ప్రతీకగా నిలిచే పవిత్రమైన బక్రీద్ (ఈదుల్ జుహా) పండుగను గురువారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని మసీదులు, ఈద్గాలలో ఆయా మత గురువులు పండుగ ప్రార్థనలు నిర్వహింపజేశారు. అల్లాహ్ దయ పొందిన హజరత్ ఇబ్రహీం నడిచిన త్యాగాల బాటలో ముస్లింలు పయనించాలని, దైవం పట్ల విశ్వాసాన్ని కలిగి ఉండాలని, ఆయన కృపను పొందాలని పేర్కొన్నారు. ముస్లింలందరూ సాటి మానవుల సంక్షేమం కోసం చేయాలని సూచించారు. అనంతరం ఒకరునొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

అమీన్‌పీర్ దర్గా మసీదులో

పెద్దదర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ ఆధ్వర్యంలో దర్గా మసీదులో సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మత గురువులు తన ప్రసంగంలో ఏకేశ్వరుడైన అల్లాహ్ ప్రవక్త ద్వారా త్యాగాన్ని ప్రబోధించారని, ప్రతి ముస్లిం వారి ఆజ్ఞలను పాటించాలన్నారు. అనంతరం భక్తులచే సామూహికంగా ప్రార్థనలు చేయించారు.

అహ్లెహదీస్ ఈద్గాలో..

నగర శివార్లలోని మాచుపల్లె వద్దగల తురకపల్లె గ్రామంలో బక్రీద్ ప్రత్యేక ప్రార్థనలను అహ్లెహదీస్ ఈద్గా మైదానంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మత గురువు ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. సమాజంలో కులమతాలకు అతీతంగా అందరితో ప్రేమానురాగాలు కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం సలఫియా ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించారు.

దండు ఈద్గాలో .. కడప నగర పరిధిలోని దండు షాహి ఈద్గాలో ముస్లింలు అధిక సంఖ్యలో బక్రీద్ ప్రార్థనలు నిర్వహించారు. అస్థానె మురాదియా పీఠాధిపతి హజరత్ జమాలుల్లాబాష సాహెబ్, అక్మల్‌పీరా మురాది పండుగ సందేశం అందజేశారు.

మజ్జిద్–యే–ఖుబాలో .. కడప నగరం రామాంజనేయపురంసాగర్ కాలనీలోగల మజ్జిద్–యే–ఖుబాలో మత గురువు ఫజిలతుస్ షేక్ తెహజీబుల్ అకల్లాకి మదని హఫిజుల్లా పండుగ సందేశం అందజేశారు.

మజ్జిద్–యే–బుఖారియాలో ..రవీంద్రనగర్‌లోని మస్జిద్–యే–బుఖారియాలో మత గురువులు భక్తులతో ఈదుల్ జుహ్హా ప్రార్థనలు నిర్వహింపజేశారు. గురువులు పండుగ సందేశం అందజేశారు.

షహమీరియా మసీదులో ..రవీంద్రనగర్‌లోని షహమీరియా మసీదులో పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా అహ్మద్‌పీర్ షహమీరి బక్రీద్ పర్వదిన ప్రత్యేక సామూహిక ప్రార్థనలు నిర్వహింపజేశారు. గుర్రాలగడ్డ వద్దగల మస్జిద్–ఏ–ఆజం (ఖిల్లా మసీదు)లో మత గురువు షహమీరియా సాహెబ్ బక్రీద్ సందేశం ఇచ్చి ప్రార్థనలు నిర్వహింపజేశారు.

హుసేనీమియా మసీదులో.. నగరంలోని ఎల్‌ఎఫ్‌వీధిలోని ఆస్థానే హుసేనియా మసీదులో బక్రీద్ ప్రార్థనలు పీఠాధిపతి సయ్యద్‌షా మహమ్మద్ షహజాద్ హుసేనీ సాహెబ్ నిర్వహించారు.

- అల్మాస్‌పేట మసీదులో మజ్జిద్ ఖతీబ్, మదరసాయే సిరాజుల్ ఉలూమ్ కరస్పాండెంట్ హఫీజ్ మౌల్వి సయ్యద్ షా భక్తియారుద్దీన్ ఖాద్రీ సాహెబ్ పండుగ విశిష్టత వివరించారు.

పోలీసుల బందోబస్తు



నగర శివార్లలో బందోబస్తు విధులను నిర్వహిస్తున్న ఎస్ఐలు రవికుమార్, ప్రతాప్‌రెడ్డి

కడప అర్బన్: బక్రీద్ పండుగ సందర్భంగా ఎస్పీ ఆదేశాల మేరకు కడప నగరంతో పాటు, జిల్లా వ్యాప్తంగా ఈద్గా మైదానాలు, మసీదుల వద్ద పోలీసు అధికారులు సిబ్బంది బందోబస్తును ఏర్పాటు చేశారు. కడప రిమ్స్ పీఎస్ పరిధిలో ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి, చిన్నచౌక్ పరిధిలో ఎస్ఐ రవికుమార్ తమ సిబ్బందితో వెళ్లి ప్రశాంతంగా పండుగ జరుపుకునేలా తమ వంతు కృషి చేశారు.

ఘనంగా పండుగ

కమలాపురం : పట్టణంతో పాటు మండల పరిధిలోని జీవంపేట, పెద్దచెప్పలి, చిన్నచెప్పలి, పందిళ్లపల్లె, కోగటం, మొలకవారిపల్లె, విభరాపురం, గంగవరం, అప్పాయపల్లె, సి.గోపులాపురం తదితర గ్రామాలలో బక్రీద్ పండుగ వేడుకలను ముస్లింలు ఘనంగా నిర్వహించుకున్నారు. హాఫీజ్ సయ్యద్ జాహీద్ హుసేన్ నమాజ్ చదివించారు. అలాగే దర్గా మస్జిద్‌లో పీఠాధిపతి హజరత్ ఫైజుల్ గఫార్ షా ఖాద్రి ఆధ్వర్యంలో ముస్లిం సోదరులు ప్రత్యేక నమాజ్ ఆచరించారు.

వల్లూరు : మండలంలోని వల్లూరు, పెద్దపుత్త, దిగువపల్లె, తప్పెట్ల, తోల్లగంగనపల్లె, ధర్మాపురం కాలనీ, పైడికాలువ, కోట్లూరు, గణేష్‌పురం తదితర గ్రామాలలో ముస్లింలు ఈద్గాలకు వెళ్లి ప్రార్థనలు చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

రైతును ఆదుకోవాలన్నదే ప్రభుత్వ లక్ష్యం



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : రైతును అన్ని విధాలా ఆదుకోవాలన్నదే రాష్ట ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మొదట తొలి ఏకాదశి, బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. వర్షానికి ఖరీఫ్‌కు సంబంధించి దెబ్బతిన్న పంటల విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని దీనిపై ప్రభుత్వం అధికారులను అప్రమత్తం చేసి నష్టాన్ని అంచనా వేయాలని చూసించిందన్నారు. జిల్లాలో ఎక్కువగా పంట దెబ్బతిన్న ప్రాంతం కమలాపురం నియోజకవర్గం. అందులో వీరపునాయునిపల్లె అత్యధికమని తెలిపారు. జిల్లాకు రూ.200 కోట్లు మంజూరవగా అందులో ఒక్క వీరపునాయునిపల్లె మండలానికి రూ.17 కోట్లు మంజూరైందన్నారు. కంది, పత్తి, ఉల్లి, చీనీ, వేరుశనగ పంటలకు మంజూరైనట్లు తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వం ఈ విధంగా నష్ట పరిహారం అందించలేదన్నారు. 2012లో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న సమయంలో పరిహారం కొరకు మండలస్థాయి, జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయిలో పలు మార్లు ధర్నాలు చేశారన్నారు. రైతులను సకాలంలో ఆదుకుంటున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ప్రజల తరఫున దన్యవాదాలు తెలిపారు. అనంతరం రవీంద్రనాథ్‌రెడ్డిని రైతులు ఘనంగా సత్కరించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకుడు కొండారెడ్డి నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, గడ్డంవారిపల్లె సహకార సంఘం అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, మండల రైతు సంఘం నాయకుడు భాస్కర్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

– డీఈఓకు ఏపీటీఎఫ్ వినతి

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో ఇటీవల జరిగిన బదిలీలు, పదోన్నతుల్లో భాగంగా కొత్త పాఠశాలల్లో చేరిన కొంతమంది ఉపాధ్యాయుల, ప్రధానోపాధ్యాయుల వేతనాల సమస్యను అధికారులు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాసుందర్‌రెడ్డి కోరారు. ఈ విషయమై గురువారం కడప గాంధీనగర్ స్కూల్లో డీఈఓ రాఘవరెడ్డిని కలిసి వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ సాంకేతిక కారణాల వల్ల బదిలీలలో ఇబ్బంది పడుతున్న ఉపాధ్యాయులు సమస్యలు పరిష్కరించాలన్నారు. అలాగే గతంలో జరిగిన పదోన్నతులలో నిరాకరించిన ఉపాధ్యాయులకు సీనియార్టీ జాబితాలో లేని వారికి త్వరలో జరగబోయే పదోన్నతులలో అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, రాష్ట్ర ఆడిట్ కమిటి సభ్యుడు కృష్ణారెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ ఖాదర్‌భాష, జిల్లా ఉపాధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, జిల్లా కౌన్సిలర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న మెగా లేఅవుట్ పరిశీలన

పులివెందుల టౌన్ : పట్టణంలోని ముద్దనూరు రోడ్డు సమీపంలో ఉన్న జగనన్న మెగా లేఅవుట్‌ను గురువారం పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి అధికారులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. ప్రస్తుతం జగనన్న లేఅవుట్‌లో డెక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ 4వేల ఇళ్లను నిర్మించేందుకు అంగీకారం తెలిపిందన్నారు. జగనన్న లేఅవుట్‌లో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులచేత రూ.35వేల రుణం చెల్లించని వారు సకాలంలో చెల్లించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం జగనన్న లేఅవుట్‌కు సంబంధించిన మ్యాప్‌ను డెక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డిలతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డెక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ మేనేజర్, సైట్ ఇంజనీర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి



విశేష అలంకారంలో స్వామి, అమ్మవార్లు

కడప కల్చరల్ : ఆషాఢ శుద్ద తొలి ఏకాదశిని పురస్కరించుకుని గురువారం కడప నగరంలోని శ్రీ లక్ష్మి సత్యనారాయణస్వామి ఆలయంలో విశేష పూజోత్సవాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కల్యాణపురం విజయ్‌భట్టర్ ఆధ్వర్యంలో ఉదయం 6.30 గంటలకు భగవత్ విజ్ఞాపనం, మహాసంకల్పం, సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణం నిర్వహించారు. అనంతరం మూలమూర్తులతోపాటు ఉత్సవ మూర్తులకు కూడా విశేష అలంకారం చేసి సహస్ర నామార్చన, మహానివేదన, అనంతరం నక్షత్ర, కుంభహారతి తదితర పూజలు చేసి వేద స్వస్తి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఉదయం 9.30 గంటలకు ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీపై స్వామి, అమ్మవార్లను కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. అలాగే నగరంలోని దాదాపు అన్ని వైష్ణవాలయాలలో ఆషాఢ శుద్ద తొలి ఏకాదశి సందర్భంగా ఉదయం 5.30 నుంచి మూలమూర్తులకు విశేష అలంకారం, పూజలు నిర్వహించారు.

విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టాలి



మాట్లాడుతున్న డాక్టర్ సుధీర్

కడప కోటిరెడ్డిసర్కిల్: విద్యార్థులు చదువు పట్ల ఏకాగ్రత కలిగి నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించాలని రెడీమర్ చర్చి అధినేత డాక్టర్ సుధీర్, స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ అధికారి జాన్సన్ తెలిపారు. గురువారం స్థానిక స్టార్ ఫంక్షన్ హాలులో విద్యార్థులు పరీక్షల్లో రాణించేందుకు అనుసరించాల్సిన విధానాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎప్పటికీ చదువు రాదని భావించరాదన్నారు. కష్టపడి చదివితే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని గుర్తించుకోవాలన్నారు. క్రమశిక్షణతో కూడిన జీవితం గడిపితే జీవితం బాగుంటుందని వివరించారు. చెడు అలవాట్లు కలిగిన విద్యార్థులకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు ప్రసాద్, అశోక్, యోహాన్, డేవిడ్ మనోహర్, కేపీ రొనాల్డ్, శ్యామూల్‌రాజ్, సుందరేశన్, సురేష్, నాగేంద్ర, సూరి తదితరులు పాల్గొన్నారు.

జానపద కళలను ఆదరిద్దాం

– ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వెంకటసుబ్బయ్య



మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వెంకటసుబ్బయ్య

బ్రహ్మంగారిమఠం : గ్రామీణులు జానపద కళలను మరువకూడదని వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ హనుమంతు వెంకట సుబ్బయ్య తెలిపారు. గురువారం సాయంత్రం మండలంలోని తోట్లపల్లె అచలానంద ఆశ్రమంలో లలిత కళాభిరామ పింఛం, నటరాజ కులుకు భజన వారి ఆధ్వర్యంలో జానపద కళాప్రోత్సాహక ఉత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ జానపద కళల కోసం ప్రభుత్వాలు తమ వంతు కృషి చేస్తున్నాయని, ప్రస్తుత సమాజంలో టీవీలు, సోషల్ మీడియా రావడంతో కళలు వెనుకబడ్డాయన్నారు. ప్రధానంగా జానపద కళలను గ్రామీణ ప్రాంతాల ప్రజలు కొంత వరకు ఆదరిస్తున్నారని తెలిపారు. ఆశ్రమ పీఠాధిపతులు విరజానంద స్వామి మాట్లాడుతూ జానపద కళలను ప్రభుత్వాలు ప్రోత్సహిస్తే, ఆ కళలను నేర్పించే వారు ముందుకు వస్తారన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ కళాకారులకు మెమెంటోలను అందించి సత్కరించారు. కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన శివాంజనేయస్వామి దేవాలయం అధ్యక్షుడు పీఎస్ కుమార్, తెలుగు అధికార భాష సంఘం సభ్యుడు తవ్వా వెంకటయ్య, స్వరాజ్య భూషణ్ జాతీయ అవార్డు గ్రహీత ఎంకేబీఎస్‌ఆర్ సాగర్, బ్రహ్మంగారిమఠం వెంకటసుధ, సప్లయర్స్ నిర్వాహకుడు ముక్కమల్ల భాస్కర్‌రెడ్డి, సభ అధ్యక్షుడు సింగల్ రెడ్డి ఈశ్వర్‌రెడ్డి, కళారత్న గొల్లపల్లె జయన్న, కళారత్నం నగిలి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ వైభోగమే..



సతీసమేత కల్యాణ సత్యనారాయణస్వామి

పులివెందుల టౌన్ : పట్టణంలోని శ్రీమిట్టమల్లేశ్వర స్వామి ఆలయంలో వెలసిన శ్రీసత్యనారాయణ స్వామి ఆలయంలో గురువారం తొలి ఏకాదశిని పురష్కరించుకుని శ్రీలక్ష్మీ భూలక్ష్మి సమేత శ్రీసత్యనారాయణస్వామి వ్రతాన్ని, కల్యాణాన్ని కన్నుల పండువలా నిర్వహించారు. జూటూరు నాగసు గుణాకర్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో పురోహితులు శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. మంగళసూత్రాలను భక్తులకు చూపిస్తూ స్వామివారికి తాకించి అమ్మవార్ల మెడలో అలంకరించారు. పెద్దసంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ముందుగా సత్యనారాయణ స్వామి వ్రతాన్ని నిర్వహించి వ్రతం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ.. కథలను చదివి వినిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సుధీకర్‌రెడ్డి, డీఈ గంగయ్య, ఈఓ రమణ, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఆలయాల్లో తొలి ఏకాదశి పూజలు :

తొలి ఏకాదశిని పురష్కరించుకుని గురువారం ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. పట్టణంలోని అతిపురాతనమైన శ్రీరంగనాథస్వామి ఆలయంలో ఆలయ అర్చకులు కృష్ణరాజేష్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృత అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు జరిపించారు. సత్యనారాయణ స్వామి ఆలయంలో ఉదయం స్వామి వారిని వెండి ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. వెంకటేశ్వరస్వామి, అమ్మవారిశాల తదితర ఆలయాల్లో ఏకాదశి పూజలు నిర్వహించారు. భక్తులు ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు.

వేంపల్లె : పాపాఘ్ని నది ఒడ్డున ఎద్దుల కొండపై ఉన్న శ్రీలక్ష్మీ వృషభాచలేశ్వరస్వామి ఆలయం, నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న శ్రీలక్ష్మీవృషభాచలేశ్వరస్వామి అనుసంధానమైన శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో తొలి ఏకాదశి పూజలు నిర్వహించినట్లు ఆలయ ఈఓ శ్రీధర్, ఆలయ చైర్మన్ వెంకటేష్‌లు తెలిపారు. గురువారం తొలి ఏకాదశి సందర్భంగా ఆలయ అర్చకులు అచ్యుత నారాయణ, హరి ప్రవీణ్‌లు స్వామివారికి ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. సర్పంచ్ శ్రీనివాసులు, జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డిలు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సేవే ధ్యేయంగా ముందుకు సాగాలి




ప్రమాణ స్వీకారం చేస్తున్న సంస్థ నూతన కార్యవర్గం

పులివెందుల టౌన్ : సేవా కార్యక్రమాలే ధ్యేయంగా మానవత స్వచ్ఛంద సంస్థ తమ కార్యకలాపాలతో ముందుకు సాగాలని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ కోరారు. గురువారం స్థానిక పులివెందుల పెన్షనర్ల హోంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు రాఘవరెడ్డి అధ్యక్షతన సంస్థ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, ప్రొద్దుటూరు సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ టి.శ్రీనివాసులు, సెంట్రల్ కమిటీ నాయకులు గోపి, వీరారెడ్డి, మానవత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు చక్రపాణిరెడ్డి, కొండారెడ్డి, రాఘవరెడ్డి, హరిశ్చంద్రారెడ్డి, చవ్వా కృష్ణారెడ్డి, శేష మహేశ్వరమ్మలు హాజరయ్యారు. అనంతరం సంస్థ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంస్థ నూతన అధ్యక్షుడిగా ఎన్.సుబ్బరాయుడు, కార్యదర్శిగా చంద్రశేఖర రెడ్డి, కోశాధికారిగా హరిశ్చంద్రారెడ్డి, ఉపాధ్యక్షురాలుగా పద్మావతి, సంయుక్త కార్యదర్శిగా శ్రీనివాస రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా రవిశంకర్, భాస్కరరెడ్డి, గంగిరెడ్డి, మరకా సూర్యనారాయణరెడ్డిలచే ప్రమాణ స్వీకారం చేయించారు.

ఘనంగా సాయిబాబ విగ్రహ ప్రతిష్ట

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వాసవి సర్కిల్‌లో నూతనంగా నిర్మించిన శ్రీ మహాగణపతి, సద్గురు సాయిబాబా ఆలయంలో గురువారం విగ్రహ ప్రతిష్ట మహోత్సవం ఘనంగా జరిగింది. గణపతి, నవగ్రహ, శాంతి హోమాలను నిర్వహించి మహాపూర్ణాహుతి సమర్పించారు. యంత్ర ప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట, ప్రాణప్రతిష్ట, కలశ సంప్రోక్షణ, వేద స్వస్తిలను వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. టెంకాయలో సాయిబాబ విగ్రహం కొలువైన రీతిలో ఎక్కడా లేని విధంగా విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు ఆలయ చైర్మన్ సగబాల నాగరాజు తెలిపారు. విగ్రహ ప్రతిష్టానంతరం భక్తులకు అన్నప్రసాద వినియోగం జరిగింది.



టెంకాయలో కొలువైన సాయిబాబ విగ్రహం

ఉపాధి పనుల కోసం పోరాటాలు ఉధృతం చేస్తాం

బ్రహ్మంగారిమఠం : రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా రాష్ట్రంలో జరుగుతున్న పనులను ఇంకా పెంచేందుకు రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు పేర్కొన్నారు. గురువారం బ్రహ్మంగారిమఠంలో రాష్ట్రస్థాయి వ్యవసాయ కార్మిక సంఘం శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఉపాధి పనులు తగ్గాయని, కేంద్ర ప్రభుత్వం ఉపాధి పనులకు 20 శాతం బడ్జెట్‌లో నిధులను తగ్గించిందని తెలిపారు. పెరుగుతున్న గ్రామీణ పేదల జనాభాకు తగ్గట్టుగా కేంద్రం బడ్జెట్ పెంచాల్సింది పోయి తగ్గించిందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం, ప్రధాన ప్రతిపక్షం, ప్రతిపక్షపార్టీలు స్పందించడం లేదన్నారు.రెండు రోజులపాటు జరిగే ఈ శిక్షణ తరగతుల్లో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుల్లయ్య, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.